

నిత్యాన్నదానానికి విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు గోవింద సత్య ప్రసాద్, జయంతి దంపతులు (హైదరాబాద్) శనివారం రూ.25 వేల విరాళం అందించారు.



ఆలయానికి రూ.50 వేలు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తంగెళ్ల శివశంకర్, సత్యవేణి దంపతులు శనివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టా కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 12,040 క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

శృంగార వల్లభుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని **తొలి తిరుపతి** గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 9,500 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యాన స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాల రూపేణా స్వామి వారికి రూ.1,61,556 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. సుమారు 2,500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

69 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యం

ప్రత్తిపాడు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 69 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యమని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడులో సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటి వరకూ ఉపాధి హామీ పథకంలో 60 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. మార్చి నెలాఖరుకు మిగిలిన 9 లక్షల పని దినాలు కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో 50 మంది వేతనదారులతో శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసి, ఒక్కో సంఘానికి మేట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాకు 1,015 గోకులాలు మంజూరు కాగా ఇప్పటి వరకూ 239 పూర్తి చేశామన్నారు. జిల్లాలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.140 కోట్లు విడుదల చేసిందని వెంకటలక్ష్మి తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు కూడా పాల్గొన్నారు.

రేపు పీజీఆర్ఎస్ రద్దు

కాకినాడ సిటీ: సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేశారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అర్జీదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

వెండి తొడుగుల అందజేత



శంఖాలకు వెండి తొడుగులు సమర్పిస్తున్న శ్రీనివాసరావు దంపతులు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో దక్షిణావృత శంఖాలకు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు వెలగా శ్రీనివాసరావు, లక్ష్మీతాయారు దంపతులు శనివారం వెండి తొడుగులు సమర్పించారు.

ప్చ్.. బిజిలెస్

- కళ తప్పిన సంక్రాంతి మార్కెట్
- ప్రతి వ్యాపారమూ మైనస్సే..
- తగ్గిన పసిడి అమ్మకాలు
- ఆటోమొబైల్, వస్త్ర రంగానిదీ అదే దారి
- డీబీటీ పథకాలు లేక ప్రజల్లో తగ్గిన కొనుగోలు శక్తి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంక్రాంతి వచ్చింది.. ఈ సీజన్‌లో భారీ కొనుగోళ్లతో వ్యాపారాలు కళకళలాడుతూ ఉండాలి. కానీ.. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేదని వ్యాపార వర్గాలు పెదవి విరుస్తున్నాయి. వస్త్రాలు, బంగారం, ఆటోమొబైల్, గృహోపకరణాలు.. ఇలా ఏ వ్యాపారం చూసినా.. గతంతో పోలిస్తే గ్రాఫ్ నేలచూపులే చూస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా డబ్బులు నేరుగా అందించేది. గత ఏడాది సంక్రాంతికి ముందు నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న తోడు పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణాలు మంజూరు చేసింది. తూర్పు గోదావరి జిల్లాలో 14,651 మందికి రూ.15.50 కోట్లు, కాకినాడ జిల్లాలో 16,901 మందికి రూ.17.88 కోట్లు, కోనసీమ జిల్లాలో 11,177 మందికి రూ.11.17 కోట్ల చొప్పున అందించింది. అలాగే, రైతులకు ధాన్యం సొమ్ములు సకాలంలో జమ చేసింది. ఇటువంటి అనేక పథకాల ఫలితంగా దాదాపు అన్ని వర్గాల చేతుల్లో డబ్బులు ఆడాయి. అప్పట్లో ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా వృద్ధి చెంది, కొనుగోలు శక్తి పెరగడంతో నగదు మారకం జరిగి మార్కెట్లు కళకళలాడేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. కొత్త అల్లుడికి బంగారం, దుస్తులు పెట్టాలన్నా.. వాహనాలు కొనివ్వాలన్నా.. ఇంట్లోకి కొత్త వస్తువులు కొనాలన్నా.. జనం చేతిలో తగినంతగా డబ్బుల్లేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా గత ఏడాది సంక్రాంతి సీజన్‌తో పోలిస్తే ఈసారి పండగ వ్యాపారాలు మందగించాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.



కొనుగోలుదార్లు లేక కళ తప్పిన ద్వారపూడి వస్త్ర మార్కెట్

వ్యాపారాలు పడిపోయాయిలా..

- సంక్రాంతి పండగలు సోమవారం మొదలవుతున్నాయి. ఈపాటికే కొనుగోళ్లతో సందడిగా ఉండాల్సిన మార్కెట్‌లో వ్యాపారాలు మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంతటా దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది.
- జిల్లా కేంద్రాలైన కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురాల్లో బంగారంతో పాటు వస్త్ర వ్యాపారం సగానికి సగం పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు.
- వస్త్ర వ్యాపారానికి పేరెన్నికగన్న ద్వారపూడి మార్కెట్‌లో సంక్రాంతికి రూ.20 కోట్ల వ్యాపారం జరిగేది. ఈ ఏడాది సగం మాత్రమే జరిగిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.
- ఆటోమొబైల్ రంగంలో కూడా కొనుగోళ్లు పడిపోయాయి. సహజంగా కొత్తగా కార్లు కొనుగోలు చేయాలనుకునే వారు డిసెంబరులోనే కంపెనీలకు సొమ్ము చెల్లిస్తుంటారు. నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా కొత్త కార్లు డెలివరీ తీసుకుంటారు. కానీ, రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం, అమలాపురం తదితర ప్రాంతాల్లోని షోరూముల్లో ప్రస్తుత సంక్రాంతి సీజన్‌లో విక్రయాలు కార్ల తగ్గిపోయాయి. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగుల భాగస్వామ్యంతో సంక్రాంతి వేళ దూసుకుపోయే కార్ల మార్కెట్‌కు ఈ సీజన్‌లో గట్టి దెబ్బే తగిలింది. కార్ల మార్కెట్‌లో వరుసగా మారుతీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ తొలి మూడు స్థానాల్లో నిలుస్తాయి. గత సీజన్‌తో పోలిస్తే ఈ మూడు కంపెనీల కార్ల కొనుగోళ్లు ఈ సంక్రాంతికి తగ్గిపోయాయని చెబుతున్నారు. గత నెలలో ఈ మూడింటితో పాటు ఇతర కంపెనీలన్నీ కలిపి 543 కార్ల అమ్మకాలు మాత్రమే జరిగాయని మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి. అదే 2023 డిసెంబర్‌లో చూస్తే 800 వాహనాలు అమ్ముడుపోయాయి.

గత సంక్రాంతికి, ఈ సంక్రాంతికి జిల్లాల వారీగా జరిగిన వ్యాపార లావాదేవీలు (రూ.కోట్లలో)

జిల్లా	వ్యాపారం	గత సంక్రాంతి	ఈ సంక్రాంతి
తూర్పు గోదావరి	బంగారం	45	25
	వస్త్ర వ్యాపారం	40	25
	కిరాణా	40	20
కాకినాడ	బంగారం	35	20
	వస్త్ర వ్యాపారం	35	20
	కిరాణా	35	25
కోనసీమ	బంగారం	25	15
	వస్త్ర వ్యాపారం	30	15
	కిరాణా	25	18



డబ్బు మారకం లేక..



జిల్లాలో బంగారం, వెండి దుకాణాలు 3,200 వరకూ ఉన్నాయి. గత ఏడాది సంక్రాంతి పండగలతో పోల్చితే ఈ ఏడాది 35 శాతం మేర వ్యాపారం తగ్గింది. పాత బంగారం అమ్మేవారే ఎక్కువగా వస్తున్నారు. గతంతో పోల్చితే కొనేవారు బాగా తగ్గారు. జనం దగ్గర డబ్బు మారకం లేకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తోంది.

– **శేక్ అనిల్ కుమార్ జైన్,**
బులియన్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, అమలాపురం

కార్ల అమ్మకాలు తగ్గాయి



గత సీజన్‌తో పోలిస్తే కార్ల అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆ రంగానికి భరోసా కల్పించాలి. కొత్త సంవత్సరం, సంక్రాంతి పండగలు వస్తున్నాయంటే చాలు.. కార్ల కొనుగోలుకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎంతో ఆసక్తిగా ముందుకు వచ్చేవారు. డిసెంబర్‌లోనే అడ్వాన్సులు చెల్లించి, కార్లు బుక్ చేసుకునే వారు. జనవరి మొదటి వారం లేదా సంక్రాంతి ముందు కార్లు తీసుకుని వెళ్లేవారు. కానీ ఈసారి కొనుగోళ్లు అంతగా లేవు.

– **ఆర్ఎస్‌వీ సునీల్‌కుమార్,** ఆపరేషన్స్ హెడ్,
లక్ష్మీ హ్యుండాయ్, రాజమహేంద్రవరం

సగం వ్యాపారం పడిపోయింది



వ్యాపారులమంతా సంక్రాంతి సీజన్‌పై గంపెడాశలు పెట్టుకున్నాం. గత సంక్రాంతితో పోల్చి చూస్తే ఈ సంక్రాంతికి విక్రయాలు సగానికి సగం తగ్గిపోయాయి. క్షేత్ర స్థాయిలోని దుకాణదారులు ఖరీదు చేసేందుకు రాకపోవడం, వచ్చినవారు కూడా తక్కువగా ఖరీదు చేస్తూండటంతో వ్యాపారం పడిపోయింది. మరోపక్క వ్యాపార నిర్వహణ భారం వెంటాడుతోంది.

– **చిక్కాల శ్రీనివాసరావు,**
వస్త్ర వ్యాపారి, ద్వారపూడి మార్కెట్

పని లేకుండా పోయింది



గత సంక్రాంతికి ఇద్దరు సహాయకులను కుదుర్చుకుని దుస్తులు కుట్టాను. రోజుకు ఏడెనిమిది జతలు కుట్టేవాడిని. నెల రోజుల ముందు నుంచే దుస్తులు కుట్టడంతో నాలుగు డబ్బులు చేతికొచ్చి, గత సంక్రాంతి చాలా బాగా చేసుకున్నాం. సహాయకులకు కూడా పని దొరికింది. ఈసారి సంక్రాంతికి నా ఒక్కడికే పని లేని పరిస్థితి. రెడీమేడ్ దుస్తులు, మాల్స్ ప్రభావం, జనం వద్ద డబ్బు మారకం తగ్గడంతో దుస్తులు కుట్టించుకోవడానికి పెద్దగా రావడం లేదు.

– **పసలపూడి కృష్ణ,** టైలర్, అంగర,
కపిలేశ్వరపురం మండలం

భక్తజనంతో శోభిల్లిన వాడపల్లి



వాడపల్లి క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా వాసికెక్కిన ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి వేంకటేశ్వర క్షేత్రం భక్తజనంతో శోభిల్లింది. శనివార వ్రతాలతో వచ్చిన భక్తులతో పాటు సాధారణ భక్తులు, పండగ సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు చేశారు. తిరుప్పావై ద్రవిడ వేదపారాయణం చేశారు. వేంకటేశ్వర సహిత ఐశ్వర్య లక్ష్మీ హోమం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా 27వ రోజు కూడారై ఉత్సవం సందర్భంగా ఆండాళ్ అమ్మవారికి దివ్య నీరాజనం సమర్పించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మధ్యాహ్నం నుంచి ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్న సమారాధన చేశారు.

రత్నగిరి కిటకిట

- సంక్రాంతి సెలవులతో పెరిగిన భక్తుల తాకిడి
- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

అన్నవరం: సంక్రాంతి సెలవులతో రత్నగిరికి భక్తుల తాకిడి పెరిగింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి, ద్వారకా తిరుమల, వాడపల్లి, ఉప్మాక వేంకటేశ్వర స్వామి ఆలయాలకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో శనివారం అన్నవరం వచ్చి, సత్యదేవుని దర్శించుకున్నారు. వీరికి తోడు ఉదయం నుంచీ పెద్ద సంఖ్యలో ఇతర భక్తులు కూడా తరలివచ్చారు. అలాగే, ఉత్తరాది నుంచి 50 టూరిస్టు బస్సులలో భక్తులు వచ్చారు. ఇంతమంది వేలాదిగా ఒకేసారి రావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ కిక్కిరిసిపోయాయి. పార్కింగ్ స్థలాలన్నీ భక్తుల వాహనాలతో నిండిపోయాయి. స్వామివారిని సుమారు 40 వేల మంది దర్శించుకున్నారు. వ్రతాలు 1,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని 5 వేల మంది భక్తులు స్వీకరించారు.


ఘనంగా ప్రాకార సేవ

ఆలయ ప్రాంగణంలో సత్యదేవుడు, అమ్మవారి ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉదయం 10 గంటలకు తిరుచ్చి వాహనంపై వేంచేయించి, అర్చకులు పూజలు చేశారు. అనంతరం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు కొబ్బరి కాయ కొట్టి, ప్రాకార సేవ ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, తిరిగి ఆలయానికి ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. అర్చకులు, వేద పండితులు, పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగనున్న రద్దీ

సంక్రాంతి సెలవులకు ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వస్తున్న భక్తులు సత్యదేవుని దర్శనానికి తరలి రానున్న కారణంగా రత్నగిరిపై రద్దీ కొనసాగనుంది. రథసేవలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని టేకు రథంపై ఆలయ ప్రాకారంలో ఘనంగా ఊరేగించనున్నట్లు అధికారులు తెలిపారు.

అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు



విశేషాలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: రెండో ద్వారకా తిరుమలగా పేరొందిన అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4 గంటలకే మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయంలోని దీపాలు వెలిగించారు. అభిషేకం అనంతరం అర్చకులు స్వామివారిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం ఏడు గంటల తరువాత వేలాదిగా భక్తులు తరలి రావటంతో స్వామివారి దర్శనానికి సుమారు గంట సమయం పట్టింది. భక్తులకు ఉదయం ఉచితంగా ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మంది స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఆలయంలో ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన నిత్య గోత్ర నామార్చన, శుక్రవారం అభిషేకం, గోత్ర నామార్చనకు, స్వామివారికి పుష్పాలంకరణ, ప్రసాదం, అన్నదాన విరాళాలకు భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు.

పీఎం నోట ఉక్కు మాటేదీ?

- సీఎం, డిప్యూటీ సీఎం సైతం ప్రధాని భజనకే పరిమితం
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: విశాఖ పర్యటనలో ఉక్కు పరిశ్రమను కాపాడే దిశగా ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుందని రాష్ట్ర ప్రజలు ఎదురుచూసి నిరాశ చెందారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. రోడ్ షో చేసి తమ బీజేపీ బలోపేతానికి ప్రసంగించారే తప్ప విశాఖ ఉక్కు భవితవ్యం గురించి మాట్లాడకపోవడం బాధాకరమని కుడుపూడి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం అమలాపురంలో ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని పక్కనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఆయనకు గుర్తు చేసే ప్రయత్నం చేయలేదని ఆయన పేర్కొన్నారు. మోదీ భజనకే వారు పరిమితం కావడం బాధాకరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వమే కాదు, ఆ పార్టీ నుంచి ఎన్నికైన ఎంపీలు సైతం ఉక్కు పరిశ్రమను కాపాడే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు.

యువ తేజస్సు.. ప్రతిభా ఉషస్సు

- సంకల్ప బలంతో విజయానికి బాటలు
- వివేకానందుని స్ఫూర్తితో అడుగులు
- కలలు సాకారం చేసుకుంటున్న యువత



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సంకల్ప బలం ఉంటే చాలు.. తలచుకుంటే సాధించలేనిదేమీ లేదంటోంది నేటి యువత.. సమాజానికి సేవ చేయాలన్న స్వామి వివేకానందుని స్ఫూర్తితో అదే బాటలో అడుగులు వేస్తోంది.. సాటివారికి ప్రేరణనిస్తోంది.. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందన్న స్వామి వివేకానందుని బోధనలను ఆదర్శంగా తీసుకోవడమే కాదు.. ఆచరణలో చూపుతున్నారు పలువురు యువతీ యువకులు. మేలుకోమని మేలుకొలుపు పాడిన ఆయన అడుగుజాడల్లో పయనిస్తున్నారు. చీకటి నిండిన సమాజంలో కొత్త వెలుగులు నింపడానికి సమిధనొక్కటి ఆహుతిస్తున్నారు. సేవా కార్యక్రమాలతో పలువురిలో స్ఫూర్తి నింపుతూ, సమాజాన్ని జాగృతం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యాన 270 యువవజన సంఘాలు ఉండగా.. 2,700 మంది యువకులు ఉత్సాహంగా సేవామార్గంలో పయనిస్తున్నారు. అలాగే నెహ్రూ యువజన కేంద్రం ద్వారా పలు విద్యాలయాల్లో సామాజిక, విద్యా పరమైన అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. యువశక్తిని మేల్కొల్పిన స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏటా జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విజయపథంలో పయనించడంతో పాటు.. వివేకానందుని స్ఫూర్తితో సేవామార్గంలో అడుగులు వేస్తున్న వారిపై కథనం..

నేడు జాతీయ యువజనోత్సవం

వివేకానందుని స్ఫూర్తితో..



అంధ విద్యార్థులకు చేయూతనిస్తున్న హరీష్

యువత దేశానికి వెన్నెముక అనే నమ్మకంతో వారిని విద్య, వైద్య, క్రీడాపరంగా ప్రోత్సహిస్తున్నారు కాకినాడకు చెందిన హరీష్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తలాటం హరీష్. అంధ విద్యార్థులకు సహకారం అందిస్తున్నారు. దాదాపు పదేళ్లుగా యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. నగరంలోని కుళాయి చెరువు ఆవరణలో ఉన్న స్వామి వివేకానందుని విగ్రహాన్ని ఇటీవలే దాదాపు రూ.80 వేలతో ఆధునీకరించారు.

కబడ్డీలో రాణిస్తూ..



జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థిని పాలిక భవాని కబడ్డీలో రాష్ట్ర స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. వివిధ ప్రాంతాల్లో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్–17, అండర్–19 జూనియర్స్, సీనియర్స్ కబడ్డీలో సత్తా చాటి, మెడల్స్, సర్టిఫికెట్లు సాధించింది. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో విజయం సాధించాలన్నదే లక్ష్యమని చెబుతోంది. భవానీ తండ్రి రోజువారీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అయినప్పటికీ తన కుమార్తెను ఎంతో ప్రోత్సహిస్తున్నారు. **– పాలిక భవాని**

కూచిపూడిలో గోల్డ్ మెడల్..



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కూచిపూడి నృత్యంలో గోల్డ్‌మెడల్ సాధించారు కాకినాడ గ్రామీణ ప్రాంతానికి చెందిన బచ్చల మల్లికార్జునరావు. భారత ప్రభుత్వ సంగీత అకాడమీ, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం అందుకున్నారు.

– బచ్చల మల్లికార్జునరావు

వికసిత్ భారత్ జాతీయ పోటీలకు ఎంపిక..



ఢిల్లీ పోటీల్లో అనుభార్గవిని అభినందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్–2025 జాతీయ స్థాయి పోటీలకు కాకినాడ ఆదిత్య డిగ్రీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎస్.అనుభార్గవి ఎంపికైంది. 'భారతదేశాన్ని గ్లోబల్ మ్యాను ఫ్యాక్చరింగ్, పవర్ హౌస్‌గా మార్చడం' అనే అంశంపై నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోటీలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఈమె ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటోంది. పోటీల ముగింపు రోజున ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో ప్రతిభను ప్రదర్శించే అవకాశం భార్గవికి దక్కింది.

యువతకు సేవ



ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాస్టారు

ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాకాడ చిన్న మాస్టారికి స్వామి వివేకానందుని స్ఫూర్తితో యువతకు, ముఖ్యంగా విద్యార్థులకు ఏదైనా సేవ చేయాలనే సంకల్పం కలిగింది. ఈ నేపథ్యంలో యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి, పలు నైపుణ్య అంశాలపై యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఉన్నతి స్కిల్ సెంటర్ ద్వారా టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి కంప్యూటర్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

జిల్లా అధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు. వివేకానందుని బోధనలతో యువతను, విద్యార్థులను చైతన్యపరచడమే లక్ష్యంగా పని చేస్తున్నానని చెప్పారు.

సంకల్పం ఉంటే..



యువతకు సాధించాలనే సంకల్పం ఉంటే సాధ్యం కానిదేదీ లేదని నిరూపించాడు జేఎన్టీయూకే విద్యార్థి బోడపాటి నివాస్. ఇంజినీరింగ్‌లో ఈసీఈ అభ్యసిస్తూ ఏడాదికి రూ.35 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించాడు. యుక్త వయస్సులో ప్రణాళిక రూపొందించుకుంటే విజయాలు సాధించడం కష్టం కాదని, సాంకేతికతను మంచికి వినియోగించుకుంటూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెబుతున్నాడు.

క్లుప్తంగా

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు

- కత్తిపూడిలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



ఘటన స్థలంలో పడి ఉన్న మృతులు శ్యామ్‌ప్రసాద్, దివ్య

శంఖవరం: మరో రెండు రోజుల్లో రానున్న సంక్రాంతిని కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాల్సిన వారు దైవ దర్శనానికి బయలు దేరి తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన శనివారం కత్తిపూడిలో చోటు చేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన కరింశెట్టి సత్యానారాయణ మధు, కరింశెట్టి శివనారాయణ, కరింశెట్టి దివ్య, చవాకుల శ్యామ్‌ప్రసాద్, చవాకుల అనంతలక్ష్మి, చవాకుల అమ్మాజీ కలిసి స్నేహితుడు నిమ్మగడ్డ ధనుష్ ఎర్టిగా కారులో అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయలుదేరారు. ధనుష్ కారు నడుపుతుండగా మరో పది నిమిషాల్లో ఆలయానికి చేరుకునేంతలో ఫ్లై ఓవర్ వద్ద ఆగి ఉన్న లారీని కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో చవాకుల శ్యామ్‌ప్రసాద్, కరింశెట్టి దివ్య అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన కరింశెట్టి శివనారాయణను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయపడిన సత్యనారాయణ మధు, అనంతలక్ష్మి, అమ్మాజీ, ధనుష్‌ను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పండగ వేళ జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. అన్నవరం ఎస్సై హరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేశారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

చేయూతనిస్తేనే కొబ్బరికి పూర్వవైభవం

- నేడు సీడీబీ ఆవిర్భావ వేడుకలు
- రావులపాలెంలో నిర్వహణ
- హాజరు కానున్న ఉన్నతాధికారులు
- తెల్లదోమ నివారణ, మార్కెటింగ్ అవకాశాలు పెంచాలంటున్న రైతులు



సీడీబీ లోగో



కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులు

సాక్షి, అమలాపురం: గోదావరి జిల్లాల్లో వరి తరువాత పెద్ద సాగు కొబ్బరి. వేలాది రైతులు, వ్యాపారులు ప్రత్యక్షంగాను.. లక్షలాది మంది కార్మికులు, కూలీలు పరోక్షంగాను ఈ సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ సాగు సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. దిగుబడి తగ్గిపోవడం, తెగుళ్ల దాడి, మార్కెటింగ్ అవకాశాలు అంతంత మాత్రంగా ఉండటం వంటి కారణాలతో సాగు గిట్టుబాటు కావడం లేదు. ఈ సాగుకు పూర్వ వైభవం రావాలంటే కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ) చేయూతనందించాలని రైతులు కోరుతున్నారు. సీడీబీ ఏర్పాటు చేసి 45 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ)లో వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 1.8 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గోదావరి జిల్లాల రైతులు సీడీబీ నుంచి పలు ప్రోత్సాహకాలు, రాయితీలు, పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్ అవకాశాల పెంపుపై హామీలు ఆశిస్తున్నారు.

ఆంధ్రా ప్రాతినిధ్యం తక్కువ

సీడీబీలో రాష్ట్ర రైతుల ప్రాతినిధ్యం చాలా తక్కువ. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సుందర రామరాజు వైస్ చైర్మన్‌గా, శ్రీకాకుళానికి చెందిన జవహర్ ఖాన్ డైరెక్టర్‌గా పని చేశారు. వీరిద్దరూ మినహా రైతుల నుంచి కోకోనట్ బోర్డులో సభ్యునిగా పని చేసిన వారెవ్వరూ లేరు. దీంతో ఈ ప్రాంత రైతుల సమస్యలను సీడీబీలో ప్రస్తావించే వారు, రాయితీలు, నిధులు సాధించేవారు లేకుండా పోయారు. స్థానిక ఎంపీలకు సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నా వారి ప్రాతినిధ్యం శూన్యమే.

- పాతికేళ్లకు పైబడి వరుస తెగుళ్లతో కొబ్బరి కుదేలవుతోంది. 1998లో నల్లి తెగులు, 2010 ఆకు తేలు, 2018లో తెల్లదోమ కొబ్బరిని చావు దెబ్బ తీశాయి. తెల్లదోమ ఇప్పటికీ ఉంది. దీనివల్ల సుమారు 30 శాతం దిగుబడులు కోల్పోయినట్టు అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తల పరిశీలనలో తేలింది. ఈ తెగుళ్లను ఎదుర్కొనే విషయంలో సీడీబీ తమకు పూర్తి స్థాయిలో సహకరించడం లేదని కొబ్బరి రైతుల ఆరోపణ.
- కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటులో కోకోనట్ బోర్డు రాయితీలు ఇస్తుంది. అయితే అవన్నీ చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు తప్ప భారీ పరిశ్రమల ఏర్పాటు మాత్రం లేదు. గోదావరి జిల్లాలలో విలువ ఆధారిత పరిశ్రమలు పెద్దగా గిట్టుబాటు కావనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం (ఎంఎస్ఎంఈ) వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు క్లస్టర్ ప్రోగ్రాంలో 70 నుంచి 90 శాతం వరకు పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు ఇస్తుంది. ఇటువంటి తరహాలో సీడీబీ సైతం రాయితీలు ఇస్తే పరిశ్రమలు ఏర్పడే అవకాశం ఉంటుంది.
- సీడీబీ గ్రామీణ స్థాయిలో సొసైటీలు, వాటిపై ఫెడరేషన్లు, దానిపై కంపెనీలు ఏర్పాటు చేసింది. ఈ కంపెనీల ద్వారా పరిశ్రమలు కూడా ఏర్పాటు చేసి ఉంటే తమకు మేలు జరిగి ఉండేదని రైతులు చెబుతున్నారు.



కొబ్బరిని ఆశించిన తెల్లదోమను పరిశీలిస్తున్న ఉద్యాన, సీడీబీ శాస్త్రవేత్తలు

పీఏసీఎస్‌లు, సీపీసీల ద్వారా కొబ్బరి కొనుగోలు

- కోకోనట్ ప్రొడ్యూసర్ కంపెనీ (సీపీసీ)లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో) ఆధ్వర్యంలో కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులకు భారీ రాయితీలు ఇచ్చి ఏర్పాటు చేయాలి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు పెంపొందించాలి.
- కొబ్బరి బీమాకు ఎదురవుతున్న ఆటంకాలను తొలగించి ప్రతి చెట్టుకు బీమా సౌకర్యం కల్పించాలి. వాతావరణ, దిగుబడి ఆధారిత బీమా సౌకర్యం, అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను తక్కువ ధరకు అందించాలి.
- కొబ్బరిని పరిశ్రమగా గుర్తించడంతో పాటు రాయితీల కల్పన, పాతచెట్ల తొలగింపు పథకం ఆర్అండ్ఆర్ అందించే ప్రోత్సాహాన్ని చెట్టుకు రూ.వెయ్యి నుంచి రూ.2,500కు పెంచాలి.
- సీడీబీలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైతులకు ప్రాతినిధ్యం కల్పించాలి.

పర్యాటకానికి మధ్య డెల్టాలో అవకాశాలు



లొల్ల వద్ద ప్రధాన కాలువలో సాగుతున్న పడవ పోటీలు

- కలెక్టర్ మహేష్‌కుమార్
- లొల్ల లాకుల వద్ద సంక్రాంతి సంబరాలు
- పడవ, ఈత పోటీలకు శ్రీకారం

కొత్తపేట: గోదావరి పరివాహక సెంట్రల్ డెల్టా పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. ఆత్రేయపురం మండలం లొల్ల లాకులు వద్ద ప్రధాన పంట కాలువలో కోనసీమ సంక్రాంతి సంబరాల పేరిట మూడు రోజుల పాటు జరిగే సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పడవలు, ఈత పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కలెక్టర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పచ్చదనం, గోదావరి నీటి సమతోష్ణ స్థితి పర్యాటకులను ఆకట్టుకుంటుందన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందిస్తామన్నారు. ఎంపీ మాధుర్ మాట్లాడుతూ గోదావరి తీరాన ప్రకృతి రమణీయతతో అలరించే కోనసీమ ప్రాంతంలో సంక్రాంతి సంబరాలు కేరళ ఉత్సవాలను తలపిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. తొలిరోజు పడవ, ఈత పోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో స్థానిక ఆర్డీఓ పి.శ్రీకర్, నీటి వినియోగదారుల సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రయ్యిరయ్యిన రంకెలేస్తూ..!

- ధర్మవరంలో రసవత్తరంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పందాలు
- సీనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు బహుమతుల పంట
- జూనియర్స్ విభాగంలో ధర్మవరానికి ప్రథమ బహుమతి



గెలుపే లక్ష్యంగా దూసుకువెళ్తున్న ఎడ్లు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో 88వ గౌరి శంకరుల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందాలు రసవత్తరంగా జరిగాయి. స్థానిక పోలవరం కాలువ గట్టు మార్గంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 36 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి జనంతో గ్రామంలో సందడి నెలకొంది. సీనియర్ విభాగంలో కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోరా తేజా ఎడ్లు ప్రథమ బహుమతి, కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్లు ద్వితీయ బహుమతి, కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోరా తేజ చౌదరి ఎడ్లు తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. వారికి వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు నగదును, షీల్డ్‌ను అందజేశారు. జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్లు, ద్వితీయ బహుమతి కాపవరానికి చెందిన కుంచం మనోజ్ రామలింగేశ్వర ఎడ్లు, తృతీయ బహుమతిని వడిశలేరు గ్రామానికి చెందిన పైడిశెట్టి రిధమ వీరకృష్ణశ్రీ ఎడ్లు కైవసం చేసుకొన్నాయి. జూనియర్స్ విజేతలకు వరుసగా రూ.12వేలు, రూ.9 వేలు, రూ.6 వేల నగదు బహుమతులుగా అందజేశారు. న్యాయనిర్ణేతలుగా యనమల కృష్ణ, నానాజీ, ఫణి వ్యవహరించారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఉప్పొంగిన యువ కెరటాలు




ఆదిత్యలో చివరిరోజు సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు



ఆదిత్యలో సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థిని

గండేపల్లి: ఓ వైపు సంక్రాంతి సంబరాలు, మరో వైపు కలర్స్.. సాంప్రదాయ రంగు రంగుల దుస్తుల అలంకరణలు, ఫ్యాషన్ షోలు, మనసును ఆకట్టుకునే సంప్రదాయ నృత్యాలు, నవ్వులు పూయించే స్కిట్స్ ఆ ద్యంతం చూపరులను ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలతో ఆదిత్య యూనివర్సిటీ కనువిందు చేసింది. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కలర్స్ పేరిటి మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమం శనివారంతో ముగిసింది. విద్యార్థుల ప్రదర్శనలు, విదేశీ విద్యార్థుల నృత్యాలు, ఆదిత్య పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా పాల్గొని తిలకించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రపంచ యోగా పోటీల్లో భవాని ప్రతిభ



- సింగపూర్‌లోని అంతర్జాతీయ పోటీల్లో ఐదో స్థానం కైవసం

దేవరపల్లి: ఏసియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సింగపూర్‌లో జరిగిన ప్రపంచ యోగా పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయగూడేనికి చెందిన ఇమ్మణి అర్మిత భవాని చౌదరి తన సత్తా చాటింది. ఈ నెల 6 నుంచి 9 తేదీల్లో జరిగిన పోటీల్లో పలు దేశాల నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ నుంచి భవాని పాల్గొని తన ప్రతిభ చూపి ఐదో స్థానం సాధించింది. నవంబరు 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీ ల్లో బంగారు పతకం సాధించిన ఆమె ఈ నెల 14 నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. శనివారం సింగపూర్ నుంచి స్వగ్రామం రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆమెను అభినందనలలో ముంచెత్తారు.

డిఫెన్స్‌కు వెళ్లడమే లక్ష్యం

తాడేపల్లిగూడెం భారతీయ విద్యాభవన్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న భవాని మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో తాను యోగా చేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు ఆమె తెలిపారు. డిఫెన్స్‌లో చేరి ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించడం తన లక్ష్యమని పేర్కొంది.

గంజాయి విక్రయిస్తున్న 11 మంది అరెస్టు

- ఆంధ్రా–ఒడిశా బోర్డర్ నుంచి రవాణా
- 20 కేజీల సరకు, ఆరు సెల్‌ఫోన్ల స్వాధీనం



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ పీవీజీ తిలక్

నిడదవోలు: పట్టణ శివారు తీరిగూడెం ప్రాంతంలో నిర్మాణంలో టిడ్కో గృహ సముదాయాల వద్ద శుక్రవారం రాత్రి గంజాయి విక్రయిస్తున్న, వినియోగిస్తున్న 11 మందిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. సీఐ పీవీజీ తిలక్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గంజాయి అక్రమంగా కలిగి ఉన్నారనే సమాచారంతో ఎస్సై పి.శోభన్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేసి 11 మంది యువకులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి సుమారు 22 కేజీల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.1.10 లక్షలు ఉంటుంది. నిందితులు ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో స్మగ్లర్ల నుంచి గంజాయిని కొనుగోలు చేసి నిడదవోలుకు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారని సీఐ పేర్కొన్నారు. నిందితులు నిడదవోలు పట్టణానికి చెందిన డొంకా ప్రవీణ్ కుమార్, ఆముదాల రవి, చందు, ఒడిశా కోరాపుట్ జిల్లాకు చెందిన గోపి గోలారి, విశాఖ జిల్లా రత్తాలుగూడా గ్రామానికి చెందిన కోరా రామ చంద్రరావు, నిడదవోలు పట్టణానికి చెందిన కాకరపర్తి మహేష్, మజ్జి భాను ప్రకాష్, కాకి పవన్, ఎలిచర్ల మిథున్, దేవరపల్లికి చెందిన దొండపాటి గంగాధర్, దేవరపల్లి మండలం పల్లంట్లకి చెందిన చిటికిన దుర్గసాయి, దేవరపల్లికి చెందిన కొప్పాక అఖిల్ కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై పి.శోభన్‌కుమార్, ఏఎస్సై పరమహంస, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమిగా బరితెగింపు

- ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ కోడి పందేలు
- ప్రైవేటు ఆర్మీల పహారాలో నిర్వహణ



దుళ్ల శివార్లలో కూటమి పార్టీల పేరుతో బరి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రాజమహేంద్రవరం రూరల్: సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కోర్టులు, పోలీసులు ఒక పక్క మొత్తుకుంటున్నా క్షేత్రస్థాయిలో స్వయంగా ప్రజా ప్రతినిధులే నాయకత్వం వహిస్తూ కోడి పందేలకి సమాయత్తమవుతున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నేతలు మాత్రం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ కోడి పందేల బరులను సిద్ధం చేశారు. అక్కడే గుండాట, పేకాట తదితర జూదాలు, మద్యం విక్రయాలకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయా బరుల ప్రాధాన్యం, అక్కడ ఏర్పాటు చేసే చట్ట వ్యతిరేక క్రీడలపై బాహాటంగానే ప్రచారాలు కూడా చేస్తున్నారు.

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ఇప్పటికే బరులు సిద్ధమయ్యాయి. సోమవారం ఉదయం ముహూర్తాలు పెట్టి మరీ పందేలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో నేత ప్రాతినిధ్యం వహిస్తుండడం గమనార్హం. నియోజకవర్గంలోని రూరల్ మండలంలో పిడింగొయ్యి, శాటిలైట్ సిటీ, కోలమూరు, కడియం మండలంలోని వేమగిరి, కడియపులంక, దుళ్ల తదితర చోట్ల బరులు సిద్ధమయ్యాయి. వీటి నిర్వహణకు ప్రత్యేక సైన్యాన్ని సైతం వారు ఏర్పాటు చేశారు.

మరో పక్క పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి బరులు సిద్ధం చేసిన క్షేత్రాల సర్వే నెంబర్లు, యజమానుల పేర్లు, పోటీల నిర్వాహకుల పేర్లను సేకరించి బైండోవర్ చేస్తున్నారు. ఇవేవీ అంత ప్రభావం చూపకపోవడం గమనార్హం.

పరస్పర అవగాహనతోనే..

బరుల నిర్వహణకు రోజుకు నలుగురు వ్యక్తులు, నాలుగు కోళ్ల అప్పగించేలా ముందస్తు అవగాహన ఒప్పందాలు జరిగినట్లుగా తెలుస్తోంది. ఒక వేళ కోర్టులు కఠినంగా వ్యవహరిస్తే తమపై ఆ ప్రభావం పడకుండా యంత్రాంగం ఈ రకమైన ఏర్పాటు చేసినట్లుగా చెబుతున్నారు. వీటికి బరుల నిర్వాహకులు కూడా అంగీకరించడంతో ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. నియోజకవర్గంలోని ఒక బరిలో లోపల, బయట అనే ఒక జూద క్రీడను ఏర్పాటు చేసుకునేందుకు ముందుగానే రూ.20 లక్షల వరకు బరి నిర్వాహకులకు చెల్లించేలా ఒప్పందం కుదిరినట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా నాయకుల పూర్తి సహకారంతోనే కోడి పందేలు, జూదాలు సాగుతున్నాయని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.

రెండేళ్ల కఠోర సాధనతో ఈదా

స్విమ్మర్ శ్యామల



స్విమ్మర్ శ్యామలను సత్కరిస్తున్న ఐకాన్స్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు 150 కిలోమీటర్ల సముద్రాన్ని రెండేళ్ల పాటు కఠోర సాధన చేసి 7 రోజుల్లో ఈదగలిగానని ఉమెన్ స్విమ్మర్ గోలి శ్యామల అన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, సామ్రాజ్య ద సిల్వర్ కింగ్‌డమ్, శ్రీరాధా కృష్ణ కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాత సోమాలమ్మ గుడివీధిలో ఐకాన్స్ రైజ్ బిల్డింగ్స్‌లో శ్యామల, ఆమె తల్లిదండ్రులు కంటే వెంకట్రాజు, సీతాలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. శ్యామల స్పందిస్తూ రోటరీ ఐకాన్స్ తనను సత్కరించడాన్ని గౌరవంగా భావిస్తానన్నారు. తన తండ్రి ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించానన్నారు. బీచ్‌లు సందర్శించే వారు చాలా అప్రమత్తంగా ఉండాలని, సముద్ర అలల వేగాన్ని అంచనా వేయడం కష్టమన్నారు. నీటిలో పడితే లేవడానికి ఎటువంటి ఆధారం దొరకదని, ఈత వచ్చినా సరైన గైడెన్స్ లేకుండా సముద్రంలో ఈతకు వెళ్లడం ప్రమాదకరమన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా, ఐకాన్స్ అధ్యక్షులు ఇమ్మణి వెంకట్, గ్రంధి రాజా, కార్యదర్శి ఉదయగిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.